క్లుప్తంగా...

కరెంట్ ఉండని ప్రాంతాలు

మేడ్చల్‌రూరల్: పూడూర్ 33/11 కేవీ సబ్ స్టేషన్ పరిధిలోని పలు గ్రామాల్లో గురువారం విద్యుత్ అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఏఈ తెలిపారు. చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా పూడూర్, గోసాయిగూడ, మునీరాబాద్ గ్రామాల పరిధిలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

ఘనంగా అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు



కీసర: మండల కేంద్రమైన కీసరలోని శివాజీనగర్‌కాలనీలోని పోచమ్మ అమ్మవారి ఆలయంలో అమ్మవారి విగ్రహ పునఃప్రతిష్ఠ మహోత్సవాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేదపండితులు విశేష పూజలు నిర్వహించారు. గ్రామసర్పంచ్ మాధురి, ఉపసర్పంచ్ లక్ష్మణ్, మాజీ ఉపసర్పంచ్ రాయిల శ్రావణ్‌కుమార్‌గుప్తా, మాజీ ఎంపీటీసీ సభ్యుడు బెలిదే రమేష్‌గుప్తా, ఆలయకమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సెయింట్ పీటర్స్‌లో బతుకమ్మ వేడుకలు



మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. కళాశాల విద్యార్థినులు, మహిళా అధ్యాపకులు సంప్రదాయ దుస్తుల్లో కళాశాలకు చేరుకుని పూలతో బతుకమ్మను పేర్చారు. అనంతరం బతుకమ్మ వేడుకలు నిర్వహించి ఆడిపాడారు. ప్రిన్సిపాల్ శ్రీలత, డైరెక్టర్ అనురాగ్‌రెడ్డి, పీఆర్వో రవిసుధాకర్, ఏఓ హరిప్రసాద్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ట్రాఫిక్‌లో చిక్కుకున్న అంబులెన్స్



మేడ్చల్: సీఎం సభ సందర్భంగా జాతీయ రహదారిపై ట్రాఫిక్ జాం కావడంతో రోగిని తరలిస్తున్న అంబులెన్స్ వాహనంలో చిక్కుకుంది. నిజామాబాద్ నుంచి నగరంలోని ఆస్పత్రికి రోగిని తరలిస్తున్న వాహనం జాతీయ రహదారిపై వెళ్తుండగా చెక్‌పోస్ట్ సమీపంలో రహదారిపై ట్రాఫిక్ జామ్ అయ్యింది. దీంతో వాహనం అందులో చిక్కుకుంది.

ముగిసిన ఇంటర్నేషనల్ ఫ్యాకల్టీ సదస్సు

అల్వాల్: అల్వాల్‌లోని లయోలా అకాడమీ, ఐక్యుసి, ఆల్ ఇండియా అసోసియేషన్ ఫర్ క్రిస్టియన్ హయ్యర్ ఎడ్యుకేషన్, ఆసియా నెట్‌వర్క్ ఆఫ్ ది యునైటెడ్ స్టేట్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఇంటర్నేషనల్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ వర్క్‌షాప్ బుధవారం హైబ్రిడ్ మోడ్(ఆన్‌లైన్ అండ్ ఆఫ్‌లైన్)లో నిర్వహించారు. ఈ వర్క్‌షాపులో 21వ శతాబ్దపు విద్యలో క్లిష్టమైన అంశాల గురించి, ఫ్యాకల్టీ ఎక్సలెన్స్ ఇన్ టీచింగ్ అండ్ స్కాలర్‌షిప్, పరిశోధించడానికి ప్రపంచ నిపుణులు, విద్యావేత్తలతో వర్క్‌షాపు నిర్వహించారు. ముఖ్యంగా డాక్టర్ గ్లెన్‌శివ్ నేతృత్వంలో, గ్లోబల్ కేఫ్ 21వ శతాబ్దంలో ఇష్యూస్ ఫర్ ఎక్సలెన్స్ ఇన్ టీచింగ్ అండ్ లెర్నింగ్ ప్రొఫెసర్ స్పెన్సర్ టెన్సన్ నేతృత్వంలో అవుట్‌కమ్ బేస్ట్ ఎడ్యుకేషన్(ఓబీఈ), కృత్రిమ మేధ అనుసంధానం(ఏఐ), ఇన్నోవేటివ్ అసెస్‌మెంట్ టెక్నిక్ వంటి కీలకమైన అంశాల గురించి వివరించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు సుచరిత, కింగ్‌షుక్ ముఖర్జీ, లయోలా అకాడమీ ప్రిన్సిపల్ డాక్టర్ ఎల్.జోజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉప్పల్‌లో రౌడీ షీటర్ల బైండోవర్

ఉప్పల్: అసెంబ్లీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లను బైండోవర్ చేసినట్లు ఉప్పల్ ఇన్‌స్పెక్టర్ బి.శ్రవణ్ కుమార్ తెలిపారు. ముందస్తు చర్యలో భాగంగా స్టేషన్ పరిధిలో ఉన్న ఐదుగురు రౌడీ షీటర్లతో పాటు, ఇతర నేరాల్లో పాల్గొన్న, నేర చరిత్ర ఉన్న మరో 90 మందిని కూడా బైండోవర్ చేసినట్లు తెలిపారు. లైసెన్స్ కలిగి ఉన్న 40 వరకు వెపన్స్ కూడా సంబందిత విభాగాల్లో సరెండర్ చేయించినట్లు తెలిపారు. ఇంకా ఎవరైనా వెపన్స్ కలిగి ఉన్న వారు వెంటనే సంబందిత విభాగాల్లో సరెండర్ చేయాల్సిందిగా కోరారు.

హంగులు తప్ప.. హామీలు లేవు..



సభలో మాట్లాడుతున్న మంత్రి మల్లారెడ్డి

మేడ్చల్/మేడ్చల్ రూరల్: రాబోయే ఎన్నికల కోసం బీఆర్‌ఎస్ అధ్యక్షుడు సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభ పేరుతో రోజుకు రెండుసార్లు సీఎం సభలు నిర్వహిస్తుంటే మేడ్చల్ సభను మాత్రం మంత్రి మల్లారెడ్డి ఏ మాత్రం ఉపయోగించుకోలేదు. సీఎం వేదికపైకి రాగానే మేడ్చల్ బీఆర్‌ఎస్ అభ్యర్థి మంత్రి మల్లారెడ్డి తనకు మరోసారి ఓటు వేస్తే నియోజకవర్గంకు ఏమి చేస్తానోనని చెప్పకుండా నియోజకవర్గ సమస్యలు ముఖ్యమంత్రికి విన్నవించారు. బహిరంగ సభలో ప్రజలతో మాట్లాడకుండా సీఎం కేసీఆర్‌ను ప్రసన్నం చేసుకునే విధంగా ప్రసంగం చేశారు. సభ ప్రాంగణం పక్కన ఉన్న గుండ్లపోచంపల్లి హనుమాన్‌గడ్డ పక్కన ఉన్న తండాలో ఉన్న ప్రభుత్వ భూముల్లో 1,100 కుటుంబాలు నివసిస్తున్నాయని, అంతా సిద్దిపేట, సిరిసిల్ల వాసులని వారికి పట్టాలు ఇవ్వాలని సీఎంను కోరారు. శామీర్‌పేట్ చెరువుకు రూ.కోట్లు విడుదల చేసి పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని, సీఎంను కోరారు. తాను సొంత డబ్బులతో రోడ్లు, డ్రైనేజీలు నిర్మించానని, 110 గుడులు నిర్మించానని ప్రజలకు చెప్పకుండా సీఎంకు చెప్పారు.

జిల్లా అభ్యర్థుల పేరుఎత్తని సీఎం..

జిల్లా సీఎం కేసీఆర్ మొదటి ఎన్నికల సభ నిర్వహించినా జిల్లాలోని మేడ్చల్ అభ్యర్థి మల్లారెడ్డి, అధికారికంగా ప్రకటించని మల్కాజిగిరి అభ్యర్థి రాజశేఖర్ రెడ్డి, కుత్బుల్లాపూర్ అభ్యర్థి వివేకానందగౌడ్ మాత్రమే సభకు హాజరయ్యారు. సీఎం తన ప్రసంగంలో మంత్రి మల్లారెడ్డి, ఎమ్మెల్యే వివేకానంద పేర్లు మినహా మిగతా జిల్లా నియోజకవర్గాల అభ్యర్థులు ఊసు తీయలేదు.

పార్టీ మారిన జెడ్పీ చైర్మన్ పేరు ప్రస్తావించిన కేసీఆర్..

బహిరంగసభ సాయంత్రం జరగ్గా ఉదయమే బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన జిల్లా పరిషత్ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి పేరును సీఎం కేసీఆర్ ప్రస్తావించారు. సభకు హాజరైన నేతల జాబితాలో జెడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డికి నమస్కారం అంటూ ప్రసంగం మొదలు పెట్టారు. వేదికపై ఉన్న మంత్రి మల్లారెడ్డి అల్లుడు మల్కాజ్‌గిరి అభ్యర్థిగా ప్రచారంలో ఉన్న మర్రి రాజశేఖర్‌రెడ్డి పేరును ఎక్కడా ప్రస్తావించకపోవడంతో ఆయన అనుచరులు ఆశ్చర్య చకితులయ్యారు.

పోలీసులే.. అన్నీ తామై..

పది రోజుల నుంచి మంత్రి మల్లారెడ్డి సభాస్థలి వద్దే ఉంటూ సభను జయప్రదం చేసేలా అన్ని హంగులతో ఏర్పాటు చేసిన సభ కేవలం అధికారిక సభకు సీఎం హాజరైన సభలానే సాగింది. వేదికపై ఉన్న నాయకులు, జిల్లా అధ్యక్షుడు రాజు నుంచి మంత్రి మల్లారెడ్డి వరకు పోలీసులకు హుకూం జారీ చేశారు. ఎక్కడా పార్టీ నాయకులుగాని, వలంటీర్లు గాని సభ నిర్వహణలో పాల్గొనలేదు. పోలీసులే అన్ని తామై సభలో ఎవరికి ఇబ్బందులు కలగకుండా బందోబస్తు చేశారు. సభను అట్టహాసంగా నిర్వహించినా మంత్రి మల్లారెడ్డి ప్రసంగం అభ్యర్థిగా కాకుండా మంత్రిలా చేయడం, సీఎం నుంచి పెద్దగా హామీల వర్షం, పంచ్ డైలాగులు, విమర్శలు లేకపోవడం సభ చప్పగా సాగినట్లు కనిపించింది.

సీఎం సభ సైడ్‌లైట్స్

మేడ్చల్/మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లిలో బుధవారం నిర్వహించిన బీఆర్‌ఎస్ బహిరంగ సభ విజయవంతంగా ముగిసింది. మంత్రి మల్లారెడ్డి, ఆయన కుమారులు మహేందర్‌రెడ్డి, భద్రారెడ్డి, బావమరిది మద్దుల శ్రీనివాస్‌రెడ్డి పది రోజులుగా శ్రమించి సభకు కావాల్సిన అన్ని ఏర్పాట్లు చేయడంతో సభలో ఎలాంటి అపశ్రుతులు లేకుండా ముగిసింది.

- నియోజకవర్గంలోని అన్ని మున్సిపాలిటీలు, కార్పొరేషన్, గ్రామాలు, మండలాల నుంచి బస్సులు, వ్యాన్లలో నాయకులు జనాన్ని తరలించారు.

ట్రాఫిక్‌ను డైవర్ట్ చేసిన పోలీసులు..

- సీఎం సభ గుండ్లపోచంపల్లి బస్టాప్ వద్ద జాతీయ రహదారి పక్కనే నిర్వహించడంతో పోలీసులు నాగ్‌పూర్ వైపు నుంచి వచ్చే లారీలు, ఇతర భారీ వాహనాలను రింగురోడ్డు వరకు రాకముందే వివిధ రూట్లోకి మళ్లించారు. గంటల తరబడి ట్రాఫిక్ జామ్ అయ్యింది.



రోడ్లపై నిలిచిపోయిన లారీలు

- మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 7.30 గంటల వరకు వాహన దారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సభలో గాయని మధుప్రియ, కళాకారులు తమ గానంతో సభకు హాజరైన జనంను ఉర్రూతలూగించారు.
- మల్లారెడ్డి కళాకారుల పాటకు స్టెప్పులు వేసి ఇది సిరిసిల్ల, సిద్దిపేట కాదని మేడ్చల్ అని ఫుల్ జోష్‌తో ఉన్నారని అన్నారు.
- మంత్రిమల్లారెడ్డి, నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఇంచార్జ్ మహేందర్‌రెడ్డి సీఎం రాకముందు సభా వేదికపై కాకుండా జాతీయ రహదారిపై తిరుగుతూ జనాలను సభకు పోవాలని సూచించారు.

ఎన్నికలకు అన్ని రకాలుగా సిద్ధం

జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ గౌతమ్

కీసర: రాష్ట్ర శాసనసభ ఎన్నికలకు సంబంధించి మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో అన్ని రకాలుగా అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు, ఈ విషయంలో అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్ష సమావేశాలు నిర్వహించి అన్ని రకాలుగా ఎన్నికలకు సిద్ధం అయ్యేవిధంగా చర్యలు తీసుకుంటున్నామని జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ గౌతమ్ అన్నారు. బుధవారం కీసరలోని భోగారం హోలీమేరి ఇంజినీరింగ్ కాలేజీలో ఎన్నికలకు సంబందించి డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్, స్ట్రాంగ్‌రూమ్, కౌంటింగ్ కేంద్రాలను జిల్లా అదనపు కలెక్టర్లు విజయేంద్రరెడ్డి, అభిషేక్ అగస్త్య, డీసీపీ జానకీ, ఐదు నియోజకవర్గాలకు చెందిన ఎన్నికల రిటర్నింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి గౌతమ్ ఐదు శాసన సభ నియోజకవర్గాలకు సంబంధించిన కౌంటింగ్ గదులను స్వయంగా పరిశీలించి అందులో ఏర్పాట్లు ఎలా ఉన్నాయో వివరాలను స్వయంగా తెలుసుకున్నారు. జిల్లా అదనపు కలెక్టర్లు విజయేంద్రరెడ్డి, అభిషేక్ అగస్త్య, డీసీపీ జానకీ, ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మాదిగల యుద్ధభేరి వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

ఘట్‌కేసర్: పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో చలో ఇందిరా పార్కు 'మాదిగల యుద్ధభేరి' కరపత్రాన్ని ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు డాక్టర్ మీసాల మల్లేశ్‌మాదిగ ఆధ్వర్యంలో బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థిక సామాజిక, రాజకీయంగా న్యాయమైన వాటా కోసం పోరాడదామని, రాబోయే పార్లమెంట్ సమావేశంలో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టే విధంగా అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని డిమాండ్ చేశారు. వచ్చేనెల 5న నిర్వహించ తలపెట్టిన సభను విజయవంతం చేయాలన్నారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి నరసింహ, జిల్లా ప్రధాన కార్యదర్శి అంజయ్యమాదిగ, కౌన్సిలర్ మల్లేశ్, బాలయ్య, రాందాసు, మహిపాల్, ఎల్లేశ్, సంతోశ్, రాజు, నవీన్ పాల్గొన్నారు.



ఘట్‌కేసర్‌లో మాదిగల యుద్ధభేరీ కరపత్రం ఆవిష్కరిస్తున్న మల్లేశ్, నరసింహ తదితరులు

సీఎంఆర్ ప్రొఫెసర్‌కు అబ్దుల్ కలాం ఎక్స్‌లెన్సీ అవార్డు



అబ్దుల్ కలాం ఎక్స్‌లెన్సీ అవార్డు అందుకుంటున్న మునిని వెంకటేశ్వర్లు

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని సీఎంఆర్ సెట్ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ మునిని వెంకటేశ్వర్లుకు డాక్టర్ అబ్దుల్ కలాం ఎక్స్‌లెన్సీ అవార్డు దక్కింది. అబ్దుల్ కలాం 92వ జయంతి సందర్భంగా నగరంలోని రవీంద్ర భారతిలో మెగా సిటీ నవకళా వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వివిధ రంగాల్లో సేవలు అందించిన వారిని ఎక్స్‌లెన్సీ అవార్డు ఇవ్వగా అందులో భాగంగా సీఎంఆర్ సెట్ కళాశాల చెందిన మునినీ వెంకటేశ్వర్లును అవార్డుకు ఎంపిక చేసి శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, బీసీ కమిషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్ చేతులమీదుగా అవార్డు అందజేశారు. కళాశాల చైర్మన్ గోపాల్‌రెడ్డి, ప్రిన్సిపాల్ నారాయణ, అధ్యాపకులు, విద్యార్థులు అభినందనలు తెలిపారు.

ఉప్పల్ వెలుగు గుట్టలో సామూహిక కుంకుమార్చన

ఉప్పల్: ఉప్పల్ వెలుగుగుట్టలో వెలసిన భ్రమరాంబిక అమ్మవారు దసరా నవరాత్రుల సందర్భంగా రోజుకో రూపంలో భక్తులకు దర్శనమిస్తున్నారు. బుధవారం కాత్యాయనీ దేవి రూపంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. వెలుగుగుట్ట ఆలయ ప్రాంగణం అమ్మవారి గుడితో పాటు చక్కని ఆహ్లాదకరమైన వాతావరణం ఎటు చూసినా పచ్చని చెట్లు, ఓ పక్క శివాలయం, మరోపక్క శ్రీదుర్గా అమ్మవారి ఆలయం భక్తులను కనువిందు చేస్తోంది. ప్రతిరోజూ అన్నదానం నిర్వహిస్తుండటంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడుతోంది. బుధవారం ఉదయం నుంచే అనేక కార్యక్రమాలతో సామూహిక కుంకుమార్చన, 18 రకాల విశేష మంగళ హారతులతో అమ్మవారిని కొలిచారు. అంతకుముందు చండీ హోమంతో భక్తులు పరవశం పొందారు. కార్యక్రమంలో గొరిగే మల్లేష్, సంతోష్, నవీన్, సూర్యప్రకాశ్, గీతాలక్ష్మీ, ఆలయ కమిటీ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.



ఉరి వేసుకొని మహిళ ఆత్మహత్య

జవహర్‌నగర్: ఉరి వేసుకొని మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యాప్రాల్ శైలిగార్డెన్‌లో నివసించే బండారు వెంకటేశ్వర్లు, భార్య బండారు సౌజన్య(36)లు ప్రైవేట్ ఉద్యోగాలు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వెంకటేశ్వర్లు మద్యానికి బానిసయ్యాడు. తాగవద్దని భార్య సౌజన్య ఎన్నోసార్లు వారించినా వారిద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ క్రమంలో సౌజన్య ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని చున్నీతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. బుధవారం ఉదయం పనిమనిషి ఇంటికి వచ్చి తలుపుకొట్టగా తీయలేదు. వాచ్‌మెన్ సహాయంతో తలుపు పగలగొట్టి చూడగా ఆత్మహత్యకు పాల్పడి అప్పటికే మృతిచెందింది. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



మృతిచెందిన సౌజన్య

బీజేపీకి రాజీనామా

ఘట్‌కేసర్: బీజేపీ మండల అధ్యక్షుడు కోమటిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి ఆ పార్టీకి బుధవారం రాజీనామా చేశాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలో సముచిత స్థానం ఇవ్వడం లేదని, పార్టీ విధి విధానాలు నచ్చకపోవడంతో రాజీనామా చేశానన్నారు. భవిషత్ కార్యచరణ అతి త్వరలో ప్రకటిస్తానని, ఇప్పటి వరకు సహకరించిన వారందరికీ ధన్యవాదాలు తెలిపారు.



ప్రవీణ్‌రెడ్డి

నిలువెత్తు అభిమానం

మేడ్చల్: బీఆర్‌ఎస్ వీరాభిమాని సీఎం కేసీఆర్ సభలో హల్‌చల్ చేశాడు. చొక్కా విప్పి తన ఒంటిపై కారుగుర్తు వేసుకుని, నెత్తిన బీఆర్‌ఎస్ టోపీ పెట్టుకుని తన అభిమానం చాటుకున్నాడు.



అబద్ధాల పార్టీలను ఓడిద్దాం

మల్లాపూర్: అబద్ధాలు చెప్పే కాంగ్రెస్, బీజేపీలను ఓడిద్దామని మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి అన్నారు. మల్లాపూర్‌లో గడపగడపకూ తిరుగుతూ ఉప్పల్ బీఆర్‌ఎస్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి కారుగుర్తుకు ఓటు వేయాలని ప్రచారం చేశారు. ఉప్పల్ సమగ్ర అభివృద్ధి బీఆర్‌ఎస్‌తోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌నేతలు పీఆర్.ప్రవీణ్, కుంటి కృష్ణ, అల్లాడి కృష్ణయాదవ్, దయాకర్‌రెడ్డి, మల్లేష్, చిన్నదుర్గయ్య, శ్రీశైలం, అండాలు, శోభ తదితరులు పాల్గొన్నారు.

రసాయన పరిశ్రమలో బాలిక మృతి

కంపెనీ ఎదుట కుటుంబ సభ్యుల ఆందోళన

మేడ్చల్‌రూరల్: పరిశ్రమలో పనిచేస్తున్న ఓ మైనర్ బాలిక కంపెనీలోని రసాయనాల కారణంగా ప్రమాదానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన బుధవారం మేడ్చల్ పట్టణంలో చోటు చేసుకుంది. ఫలితంగా పరిశ్రమ యాజమాన్యమే మృతికి కారణమంటూ కుటుంబ సభ్యులు రాత్రి కంపెనీ ఎదుట మృతదేహంతో ఆందోళన నిర్వహించారు. మృతురాలి కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. మేడ్చల్‌కు చెందిన బాయికాడి భవాని(17) పారిశ్రామికవాడలోని హైడ్రో వెరిటెక్ పరిశ్రమలో కార్మికురాలిగా పనిచేస్తోంది. ఐదు రోజుల క్రితం భవాని అస్వస్థతకు గురికాగా కుటుంబీకులు చికిత్స నిమిత్తం ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. పరిశ్రమలో వాడే రసాయనాల కారణంగా ఊపిరాడక మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. దీంతో కుటుంబ సభ్యులు పరిశ్రమ యాజమాన్యాన్ని నిలదీశారు. యాజమాన్యం తమ తప్పేమీ లేదంటూ తెలపడంతో వారు మేడ్చల్ కౌన్సిలర్ మణికంఠను ఆశ్రయించారు. ఆయన పరిశ్రమ యాజమాన్యాన్ని సంప్రదించగా వారు సరైన సమాధానం ఇవ్వకపోగా.. తాము బాధ్యత వహించలేమని తెలపడంతో మృతదేహంతో పరిశ్రమ ముందు ఆందోళన చేపట్టారు.



భవాని (ఫైల్)



మృతదేహంతో పరిశ్రమ ఎదుట ఆందోళన చేస్తున్న కుటుంబ సభ్యులు

కారు దిగి.. చేయి అందుకుని..



కార్పొరేటర్ నిహారికగౌడ్‌ను కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న రేవంత్‌రెడ్డి



జవహర్‌నగర్ మాజీ సర్పంచ్ శంకర్‌గౌడ్‌కు కాంగ్రెస్ కండువా కప్పి ఆహ్వానిస్తున్న రేవంత్‌రెడ్డి

జవహర్‌నగర్: బీఆర్‌ఎస్‌కు భారీ షాక్ తగిలింది. బుధవారం జవహర్‌నగర్ మాజీ సర్పంచ్ కారింగుల శంకర్‌గౌడ్, కార్పొరేటర్ నిహారికగౌడ్‌లు టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమని కాంగ్రెస్ జెండా ఎగురవేసి మంత్రి మల్లారెడ్డికి తగిన బుద్ధి చెబుతామన్నారు. ఐదేళ్లుగా మల్లారెడ్డి విద్యా, వైద్య రంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేశారని మండిపడ్డారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలు తమ హక్కులను సాధించుకోవాలని కాంగ్రెస్ పార్టీతోనే అది సాధ్యమవుతుందన్నారు. మంత్రి మల్లారెడ్డి బెదిరింపులకు భయపడేదిలేదని వారు ఎన్ని ప్రయత్నాలు చేసినా మేడ్చల్‌లో కాంగ్రెస్ పార్టీ విజయకేతనం ఎగురవేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. జవహర్‌నగర్ దశదిశలు మార్చడానికి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నామని సొంత ప్రయోజనాల కోసం కాదన్నారు. మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి తోటకూర వజ్రేష్‌యాదవ్‌ను అఖండ మెజార్టీతో గెలిపించుకుంటామన్నారు. మాజీ సర్పంచ్ శంకర్‌గౌడ్, కార్పొరేటర్ నిహారికగౌడ్‌తో పాటు మాజీ వార్డు సభ్యులు మల్లీశ్వరి, బీఆర్‌ఎస్ 23వ డివిజన్ అధ్యక్షులు యాకచారి, విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు బాషపల్లి దయాకర్‌చారి, 24వ డివిజన్ బీఆర్‌ఎస్ బీసీ సెల్ అధ్యక్షులు భాస్కర్, మూర్తి తదితరులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జవహర్‌నగర్ అధ్యక్షులు మల్లెపూల శ్రీకాంత్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి గుండ్లపోచంపల్లి బీఆర్‌ఎస్ నాయకులు

మేడ్చల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీకి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు గుండ్లపోచంపల్లి మాజీ సర్పంచ్ ఈశ్వర్ నేతృత్వంలో కాంగ్రెస్‌లో చేరారు. ఘట్‌కేసర్ మండలం ప్రతాపసింగారం గ్రామంలో మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరిక సందర్భంగా ఆయన వెంట గుండ్లపోచంపల్లి బీఆర్‌ఎస్ నాయకులు పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. పార్టీలో చేరిన వారిలో మాజీ సర్పంచ్ ఈశ్వర్, మాజీ ఎంపీటీసీ రాజేష్, నాయకులు గడీల కృష్ణారెడ్డి, ఉద్దెమర్రి చిన్న కృష్ణ, రాజన్న, సంపత్, లక్ష్మణ్, ప్రకాస్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, రోహిత్, రాహుల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



ఈశ్వర్ పార్టీ కండువా కప్పుతున్న పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి

బీఆర్‌ఎస్ మోసపూరిత పాలనకు చరమగీతం పాడుదాం

మేడ్చల్ కాంగ్రెస్ అభ్యర్థి వజ్రేశ్‌యాదవ్



మాట్లాడుతున్న మేడ్చల్ కాంగ్రెస్ అభ్యర్థి వజ్రేశ్‌యాదవ్

ఘట్‌కేసర్: బీఆర్‌ఎస్ మోసపూరిత పాలనకు చరమగీతం పాడుదామని మేడ్చల్ కాంగ్రెస్ అభ్యర్థి తోటకూర వజ్రేశ్‌యాదవ్ అన్నారు. ప్రతాపసింగారంలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సమక్షంలో బుధవారం మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి, జవహర్‌నగర్ కార్పొరేటర్ నిహారిక కాంగ్రెస్‌లో చేరిన అనంతరం వజ్రేశ్‌యాదవ్ మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరడంతో వేయి ఏనుగుల బలాన్ని ఇచ్చిందన్నారు. రానున్న ఎన్నికల్లో మంత్రి మల్లారెడ్డి అవినీతిని ప్రజల్లో ఎండగడుతూ మేడ్చల్ నియోజకవర్గం అభివృద్ధే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు ఒక్కటై కాంగ్రెస్‌ను గెలిపించుకోవాలన్నారు. కాంగ్రెస్‌లో చేరిన వారిలో మాజీ సర్పంచులు వెంకటేశ్‌ముదిరాజ్, శంకర్, ఈశ్వర్, నాయకులు అంజిరెడ్డి, బాల్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ కుమార్ ముదిరాజ్, ప్రభాకర్‌రెడ్డి ఉండగా కార్యక్రమంలో ఉప్పల్ కాంగ్రెస్ అభ్యర్థి పరమేశ్వర్‌రెడ్డి, బీ బ్లాక్ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్, సర్పంచ్ గోపాల్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు, రాజేశ్, చంద్రమౌళి, రవీందర్‌యాదవ్, గోపాల్‌గౌడ్ పాల్గొన్నారు.

మార్వాడీ సమాజం అండగా నిలవాలి

కుషాయిగూడ: రానున్న ఎన్నికల్లో ఉప్పల్ నియోజకవర్గంలోని మార్వాడీ సమాజమంతా తనకు అండగా నిలవాలని బీఆర్‌ఎస్ ఉప్పల్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి కోరారు. బుధవారం ఐమాత అమ్మవారి ఆలయంలోని గోశాలలో జరిగిన పూజ, భజన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీఎల్ఆర్ మాట్లాడుతూ సేవ చేయాలనే సంకల్పంతో రాజకీయాల్లోకి వచ్చిన తనను ఆశీర్వదించి ఎమ్మెల్యేగా గెలిపించాలన్నారు. ఒక్కసారి అవకాశం కల్పిస్తే అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపిస్తానన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ప్రభుదాస్, మార్వాడీ సంఘం అధ్యక్షుడు కైలాష్‌శర్మ, డగ్లారాం, మంగ్లారాం, నాయయణ్‌లాల్ పరిహార్, కాలురాం కాగ్, హుకుమారం, దయారాం, రాజు సిర్వి, అనిల్ జైల్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ ఉప్పల్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి

కాంగ్రెస్‌ను భారీ మెజార్టీతో గెలిపించండి

అల్వాల్: మల్కాజిగిరి నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి మైనంపల్లి హన్మంతరావును భారీ మెజార్టీతో గెలిపించాలని మైనంపల్లి హన్మంతరావు సతీమణి మైనంపల్లి వాణి అన్నారు. బుధవారం మచ్చబొల్లారం డివిజన్ పరిధిలోని తుర్కపల్లి బంధంబావి, ఏఆర్‌కే హోమ్స్, రైల్వే ఎంప్లాయిస్ కాలనీలలో గడప గడపకు తిరుగుతూ కాంగ్రెస్ ప్రవేశపెట్టి మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. రానున్న ఎన్నికల్లో మల్కాజిగిరిలో కాంగ్రెస్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రాజ్ జితేంద్రనాథ్, నాయకులు బొబ్బిలి సురేందర్ రెడ్డి, పుట్నాల కృష్ణ, నిమ్మ అశోక్‌రెడ్డి, కృష్ణగౌడ్, శ్రీశైలం యాదవ్, శంకర్, మల్లెల శివ, భబిత, గాయిత్రి, శశికళ తదితరులు పాల్గొన్నారు.



మచ్చబొల్లారం డివిజన్‌లో ప్రచారం చేస్తున్న మైనంపల్లి వాణి